క్లుప్తంగా

ఓటర్ల చేర్పులు త్వరితగతిన చేపట్టాలి

తాళ్లూరు: ఓటర్ల మార్పులు, చేర్పులు త్వరితగతిన అయ్యేలా చూడాలని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ (ఈఆర్ఓ) ఎంవీఎస్ లోకేశ్వరరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్ఓలతో ఆయన సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాలలో ఎవైనా మార్పులు చేర్పులు, సవరణలు ఉంటే బీఎల్ఓలు గుర్తించి తగిన విధంగా నమోదు చేయించాలని కోరారు. మరణాలతో పాటు, ఫొటోల్లో తేడాలు ఉంటే గుర్తించాలని చెప్పారు. పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. ఎలక్షన్ డీటీ రవికుమార్, ఎస్ఏ మూర్తి, జేఏ సుధీర్ పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ఉపాధ్యాయులు



డీఈవోను సన్మానిస్తున్న ఎర్రయ్య, ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: పట్టణానికి చెందిన ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.ఎర్రయ్య ఆధ్వర్యంలో నూతన డీఈవో పి.రమేష్‌ను ఒంగోలులోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి సన్మానించినట్లు రాష్ట్ర బైలా కమిటీ కన్వీనర్ మండ్లా రామాంజనేయులు తెలిపారు. డీఈవోను కలిసిన వారిలో అల్లూరిరెడ్డి, సుబ్బారెడ్డి, శేఖర్, ఉమామహేశ్వరరావు, పీరాసాహెబ్ ఉన్నట్లు పేర్కొన్నారు.

శివస్వాముల పాదయాత్ర



మోకాళ్లపై నడుస్తున్న అవుల వెంకటరెడ్డి

కురిచేడు: మండలదీక్ష పూర్తి చేసుకుని శివస్వాములు ఇరుముడితో శ్రీశైలం పాదయాత్రకు బయల్దేరారు. వారితో పాటు మాజీ సర్పంచ్ అవుల వెంకటరెడ్డి పాదయాత్ర చేస్తూ గ్రామంలో కొంతదూరం మోకాళ్లపై నడిచి తన భక్తిని చాటుకున్నారు. శివస్వాములతో పాటు తాను కూడా శ్రీశైలం పాదయాత్ర చేస్తూ స్వాములకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ముందుగా శ్రీ జ్ఞాన ప్రసూనాంబాసమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

దర్శి: పట్టణంలోని రజక కాలనీలో పేకాడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పేకాడుతున్న వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని వారి వద్ద రూ.7,500 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని దర్శి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

జగనన్న తోడు కింద 40 మందికి రూ.4 లక్షలు



రుణాలు అందిస్తున్న మేనేజర్ కుమార్

మార్కాపురం: ఆర్థికంగా పేదలు అభివృద్ధి చెందేందుకు జగనన్న తోడు పథకాన్ని ఉపయోగించుకోవాలని ఏపీజీబీ తిప్పాయపాలెం మేనేజర్ రెడ్డి కుమార్ అన్నారు. మంగళవారం బ్యాంక్ పరిధిలో వైఎస్సార్ క్రాంతి పథం, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆరో విడత జగనన్న తోడుకు సంబంధించి చిరు వ్యాపారం చేసుకునే 40 మందికి రూ.10 వేలు చొప్పున రూ.4 లక్షలు వెలుగు ఏపీఎం రమేష్‌తో కలిసి అందించారు. మొత్తం 425 మందికి జగనన్న తోడులో రుణాలు అందిస్తామని రమేష్ తెలిపారు. వ్యాపారాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. అనిల్, జయకుమారి, పీరమ్మ, బాబు, వెలుగొండయ్య పాల్గొన్నారు.

త్రిశూలేశ్వర అలంకారంలో స్వామివారు



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

పొదిలి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా పొదిలిలో జరుగుతున్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నాలుగో రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం అశ్వ వాహనంపై త్రిశూలేశ్వర అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరంపార్వతీ పరమేశ్వరిని ఉత్సవ మూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి పొదిలి పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాతలు శింగంశెట్టి శేషయ్య, వందవాసి అనంతలక్ష్మి, బొగ్గవరపు వెంకటసుబ్బారావులు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నైవేద్యాలు చెల్లించి తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.

హాస్టల్ భవనానికి స్థలం కేటాయించాలి



సీఈ మురళీనాథ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి, సర్పంచ్ కృష్ణయ్య

కురిచేడు: ఎస్సీ హాస్టల్ భవనానికి స్థలం కేటాయించాని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి నాగార్జున సాగర్ కుడికాలువ చీఫ్ ఇంజినీర్ మురళీనాథ్‌రెడ్డిని కోరారు. నాగార్జున సాగర్ కాలువను ఆయన మంగళవారం పరిశీలించారు. సీఈని 126వ మైలు దర్శి బ్రాంచి కాలువ హెడ్‌రెగ్యులేటర్ కురిచేడు వద్ద జెడ్పీటీసీ నాగిరెడ్డి కలిసి మాట్లాడారు. కాలువ కట్టపై చెట్లు పెరిగి నడిచేందుకు కూడా వీల్లేకుండా ఉందని, వాటిని తొలగించి గుంతలు పూడ్చాలని కోరారు. ఎస్సీ హాస్టల్ 30 ఏళ్లుగా నిర్వహిస్తున్నా స్థలం లేక సొంత భవనం నిర్మించలేదని, ఎస్ఎస్‌పీ కాలనీలో స్థలాన్ని కేటాయిస్తే హాస్టల్ భవన నిర్మించేలా అధికారులను కోరతానన్నారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని సీఈ హామీ ఇచ్చారు. అనంతరం సీఈ మురళీనాథ్‌రెడ్డికి సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్యతో కలిసి జెడ్పీటీసీ వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ఎస్ఈ లక్ష్మీరెడ్డి, దర్శి డివిజన్ ఈఈ బి.వెంకటరాజు, కురిచేడు, దర్శి సబ్ డివిజన్‌ల డీఈఈలు విజయలక్ష్మి, అక్బర్‌బాషా, కురిచేడు, దర్శి జేఈఈలు ప్రసన్నకుమార్, కేశవరావు, హేమంత్‌కుమార్, విజయరత్నం పాల్గొన్నారు.

దర్శి: మరమ్మతులకు ఎస్టిమేషన్‌లు వేసి పంపించాలని ఎన్ఎస్పీ సీఈ మురళీనాథ్‌రెడ్డి సూచించారు. దర్శి ఓబీసీ కెనాల్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. నీటి విడుదలలో పాటిస్తున్న ప్రమాణాలు, నీటి అవసరాలపై అధికారులతో చర్చించారు.

శివరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలి



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న సభ్యులు

- ఎమ్మెల్యేకు ధర్మకర్తల మండలి ఆహ్వానం

మార్కాపురం: జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రం పొదిలి నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ధర్మకర్తల మండలి చైర్మన్ యక్కలి శేషగిరిరావు, ధర్మకర్తలు అంజిరెడ్డి, గొలమూరి నాగమణి చెన్నారెడ్డిలు మంగళవారం రాత్రి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి నివాసానికి వచ్చి ప్రత్యేక ఆహ్వాన పత్రిక అందించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18వ తేదీ శివరాత్రి రోజున స్వామి వారికి నంది శేవ, మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని, 19వ తేదీన అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 23 వరకు ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీని ఘనంగా సన్మానించారు. ధర్మకర్తలు నాగేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

జంకె వెంకటరెడ్డికి కూడా..

మార్కాపురం టౌన్: పొదిలి నిర్మమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు హాజరు కావాలని దేవస్థానం కమిటీ చైర్మన్ శేషగిరిరావు, ధర్మకర్తలు నాగమణి చెన్నారెడ్డి, అంజిరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు మంగళవారం రాత్రి మార్కాపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని ఆహ్వానించారు. అనంతరం జంకెను సన్మానించారు.

దామోదర సంజీవయ్యకు ఘన నివాళి



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి: రాష్ట్ర దళిత సేన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య 102వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోతవరం సర్పంచ్ కోట నాగేంద్రం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. దళిత సేన ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం సంజీవయ్య తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. యాదవ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లవరం రంగారావు, రాచపూడి బాబూరావు, కనకారావు, సత్యం, మార్క్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి వెన్నా సన్మానం



ఎమ్మెల్సీ అభ్యర్థిని సన్మానిస్తున్న వెన్నా

మార్కాపురం: ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డిలు మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ పొల్యూషన్ బోర్డు మెంబర్, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లి అధ్యాపకులు, సిబ్బందితో సమావేశమయ్యారు. తనను గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. వారిని వెన్నా హనుమారెడ్డి ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకట రామిరెడ్డిలు ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా గిద్దలూరు, కొమరోలు మండలాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.బాలఅంకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు మండలాల్లోని వ్యవసాయ బోరులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉదయం 5 గంటల నుంచి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

సబ్సిడీపై తుంపర సేద్యం పరికరాలు

బేస్తవారిపేట: సబ్సిడీపై తుంపర సేద్యం పరికరాలు అందజేస్తున్నట్లు ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత తెలిపారు. మంగళవారం మండలంలోని బార్లకుంట, గలిజేరుగుళ్లలో మిరప, మొక్కజొన్న, గోరుచిక్కుడు పంటల్లో ఉపయోగిస్తున్న తుంపర సేద్యం పరికరాలను ఆమె తనిఖీ చేశారు. 2.5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 30 పైపులు, 5 స్ప్రింక్లర్లు, 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 41 పైపులు, 9 స్ప్రింక్లర్లు అందిస్తున్నామన్నారు. బిందు సేద్య పరికరాలు 5 ఎకరాల్లోపు రైతులకు 90 శాతం, 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం సబ్సిడీపై ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పరికరాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారం కోసం డ్రోన్ సర్వే

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్షణ పథకంలో భాగంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కంచిపల్లెలో డ్రోన్ సర్వేను మంగళవారం సర్పంచి వెంకట రాజమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు భూ సమస్యలను పరిష్కరించేందుకు సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్ఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి జమాల్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాశయ్య, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి బుజ్జిబాయి రైతులకు సూచించారు. మండలంలోని బోయిదగుంపుల, తోకపల్లె, చట్లమిట్ల రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. అనంతరం వీఏఏలతో కలిసి ఈ క్రాప్‌లో నమోదు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. ఈ క్రాప్ నమోదు పకడ్బందీగా చేయాలని వీఏఏలు, వీఆర్వోలు, సర్వేయర్లకు సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, కనీస మద్దతు ధర వర్తిస్తాయని స్పష్టం చేశారు.

బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ చేసుకోవాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ రాజారావు

పుల్లలచెరువు: ఉపాధి హామీ కూలీలు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ చేయకపోతే వారుచేసిన ఉపాధి పనులకు సంబంధించిన కూలీ సొమ్ము మంజూరు కాదని డ్వామా ఏపీడీ రాజారావు తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పుల్లలచెరువులో కూలీలతో మాట్లాడుతూ.. పని చేసేటపుడు సమయపాలన ముఖ్యమన్నారు. కూలీల సంఖ్య పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. దొంగ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలకు తమ సమస్యలను ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఏపీఓ శైలజ, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

పొదిలి రూరల్: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథ అన్నారు. మంగళవారం పొదిలి మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలకు చెందిన మానసిక చిన్నారులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టుకతోనే పలువురు చిన్నారులు ఎదుగుదల్లో లోపాలతో పాటు పలు సమస్యలతో మానసికంగా బాధపడుతుంటారన్నారు. అలాంటి పిల్లలున్న నిరుపేద కుటుంబాల వారు మెరుగైన వైద్యం అందించలేక చాలా మంది అల్లాడుతున్నారని చెప్పారు. అలాంటి వారికి రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం వెలుగు నింపుతోందన్నారు. జిల్లాలో ఒంగోలు, మార్కాపురంలో బాల భవిత కార్యక్రమం సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డాక్టర్లు సుబ్బారావు, యశ్వంత్ ఉన్నారు.

ట్యాక్స్‌లు చెల్లించాలి: ఎంవీఐ

దర్శి: స్థానిక ఎంవీఐ యూనిట్ కార్యాలయం పరిధిలో 544 రవాణా వాహనాలు ట్యాక్స్‌లు చెల్లించాలని ఎంవీఐ రవికుమార్ కోరారు. వీటిలో లారీలు, ట్రాక్టర్లు, మ్యాక్సీ క్యాబ్‌లు, గూడ్స్ వాహనాలు, ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ బస్సులు, అంబులెన్స్‌లు, ఫేజ్ క్యారేజీ బస్సులు, హార్వెస్టర్‌లు ఉన్నాయన్నారు. వెంటనే ట్యాక్స్‌లు కట్టకుంటే 200 శాతం జరిమానాతో చెల్లించాల్సి వస్తుందని ఎంవీఐ హెచ్చరించారు.

స్థల వివాదంపై ఇరువర్గాల ఘర్షణ

యర్రగొండపాలెం: స్థలం వివాదంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడిన సంఘటన మండలంలోని గడ్డమీదిపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై జి.కోటయ్య కథనం మేరకు.. ఎస్.మురళి, ఎం.పెద్దబాలగురవయ్య మధ్య గత కొంతకాలంగా స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఈ ఘర్షణలో మురళి కుడి చెవిని పెద్దబాలగురవయ్య కొరకడంతో తెగిపడింది. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు ఏడుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన మురళిని చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీఓ

దొనకొండ: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి కోరారు. మండలంలోని తెల్లబాడులో ఇంటి పన్ను వసూలు చేసే కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలందించారు. మీ పంచాయతీని మీరే అభివృద్ధి చేసుకోవాలని, దానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఇంటి పన్ను వసూలుకు సహకరించాలన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తెల్లబాడులో పారిశుధ్య పనులను డీపీఓ నారాయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. డ్యాస్ డే-డ్రైడే కార్యక్రమంలో పాల్గొని వీధుల్లో తిరిగి ఆరోగ్య సిబ్బందికి సూచన, సలహాలందించారు.

వీధుల వెంట మురుగు లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును డీపీఓ ఆదేశించారు. అనంతరం డంపింగ్ యార్డుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ యామిని బాలిరెడ్డి, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఈఓఆర్డీ ఎస్.డేవిడ్, కార్యదర్శులు యల్లాబాబు, వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, వైద్య సిబ్బంది ఉన్నారు.

కాలిపోయిన మృతదేహం గుర్తింపు

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లి ఘాట్ సమీపంలో కాలిపోయిన మృతదేహాన్ని స్థానికులు మంగళవారం రాత్రి గుర్తించారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని పెద్ద ఎమునూరుకు చెందిన బత్తుల సాయి తరుణ్ తేజ (22) వైజాగ్‌లో నివసిస్తున్న తన సోదరుడు వద్దకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పాడు. కానీ అతడి మృతదేహం తాడివారిపల్లి ఘాట్ సమీపంలో కాలిపోయి లభించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని పొదిలి సీఐ సుధాకర్రావు పరిశీలించారు. తాడివారిపల్లి ఎస్ఐ ముక్కంటి కేసును విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా ఆరో అదనపు జడ్జి రాజావెంకటాద్రి



మాట్లాడుతున్న జడ్జి రాజావెంకటాద్రి

మార్కాపురం టౌన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని మార్కాపురంలోని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజావెంకటాద్రి అన్నారు. మంగళవారం డాక్టర్ శామ్యూల్ జార్జి ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డేకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లక్ష్యాన్ని ఏర్పర్చుకుని సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదివితే జీవితంలో విజయాలు సాధించవచ్చన్నారు. ఫార్మకో విజిలెన్స్ సీనియర్ రీసెర్చ్ అసోసియేట్ కె.విద్యాసాగర్ మాట్లాడుతూ లైబ్రరీలో 10 వేల ఫార్మసీ పుస్తకాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఫార్మసీలో మన దేశం వైపు చూస్తున్నాయని, ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా జయరావు, ప్రొఫెసర్ సునీత పాల్గొన్నారు. అనంతరం రాజావెంకటాద్రిని ఘనంగా సన్మానించారు.

సైనికుల త్యాగాలు మరువ లేనివి



మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

మార్కాపురం టౌన్: సైనికుల త్యాగాలు మరువలేనివని సీఐ భీమానాయక్ అన్నారు. మంగళవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో కమలా హైస్కూల్ ఎన్‌సీసీ విభాగం విద్యార్థులు తమ పాఠశాల నుంచి ర్యాలీగా స్టేషన్ వరకు వచ్చారు. పుల్వామా సైనిక దాడికి నిరసనగా బ్లాక్‌డే సందర్భంగా జరిగిన ర్యాలీలో సీఐ మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. సైనికులను గౌరవించాలని సూచించారు. విద్యార్థులు దేశ రక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌తో జాగ్రత్త

విద్యార్థులు, విద్యార్థినిలు సెల్‌ఫోన్‌తో జాగ్రత్తగా ఉండాలని సీఐ భీమానాయక్ హెచ్చరించారు. బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ టెక్నాలజీని అభివృద్ధికి వాడుకుంటే బాగుంటుందని, దుర్వినియోగం చేస్తే భవిష్యత్ పాడైపోతుందని హెచ్చరించారు. చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు.

ఆర్‌బీకేల తనిఖీ



కియోస్క్‌ను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ

దొనకొండ: మండలంలోని మంగినపూడి, ఇండ్లచెరువు ఆర్‌బీకేలను మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కియోస్క్ పని తీరును పరిశీలించారు. కియోస్క్‌లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు మార్కెట్ ధరలకు బుక్ చేసుకోవచ్చన్నారు. సిబ్బందికి సూచన, సలహాలందించారు. ఆర్‌బీకే సిబ్బంది రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

పంట నమోదుకు ఈ నెల 25న ఆఖరు

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ నెల 25వ తేదీ ఈ-క్రాప్ బుకింగ్‌కు ఆఖరని ఏఓ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో సుమారు 2,300 మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ క్రాప్ నమోదును రైతులు వీలైనంత త్వరలో చేసుకోవాలని ఏఓ సూచించారు. ఆయన వెంట ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యం కోసం రోజూ సైక్లింగ్



సైకిల్ ర్యాలీలో డాక్టర్ రాహుల్, రాజశేఖర్

మార్కాపురం: శరీరంలో అధిక కొవ్వు, అధిక క్యాలరీలను కరిగించేందుకు, బీపీ, గుండె, క్యాన్సర్ వంటి జబ్బుల నివారణకు, మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు సైక్లింగ్ ఉపయోగపడుతుందని జిల్లా ఉప వైద్యశాధికారి డాక్టర్ కె.రాహుల్ తెలిపారు. మంగళవారం హెల్త్ మేళా సందర్భంగా కోర్టు సెంటర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఫిబ్రవరి నెలను ఆరోగ్యం కోసం సైక్లింగ్ అనే నినాదం అమలు చేస్తోందన్నారు. గంట సైకిల్ తొక్కడం ద్వారా 400 నుంచి 750 క్యాలరీలను కరిగించవచ్చన్నారు. శారీరక రుగ్మతలను పోగొట్టుకోవచ్చని, శరీరంలో ఎండార్ఫిన్‌లు విడుదలై మానసిక ప్రశాంతతకు నిద్రకు ఉపయోగపడుతుందని తెలిపారు. వైద్యులు సీహెచ్ రాజశేఖర్, దీపిక మంజూషా, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌లు శ్రీకాంత్, నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం మెరుగు



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

ముండ్లమూరు: క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చని వైద్యాధికారినులు వి.జ్యోతి, ఎం.జాస్మిన్ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ మాన్ భారత్-ఆరోగ్య మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మెరుగైన ఆరోగ్యం కోసం వ్యాయామం తప్పని సరన్నారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా తగ్గించవచ్చన్నారు. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలు చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సైకిల్ తొక్కితే కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి దర్శి-అద్దంకి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ నారాయణరావు, హెల్త్ విజిటర్ కన్యాకుమారి, ఫార్మసిస్ట్ యుగంధర్, స్వచ్ఛంద సంస్థ నిర్వహకుడు డగ్లస్ పాల్గొన్నారు.

జ్వాలాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు



హోమం చేస్తున్న భక్తులు

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు జ్వాలాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఆలయంలో ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. మాధవస్వామి దేవాలయం ట్రస్ట్ చైర్మన్ పులి అంజిరెడ్డి దంపతులు సింహ వాహనం, పులి వెంకటేశ్వరరెడ్డి, శిరీష దంపతులు బహూకరించిన త్రిశూలం, గ్రంథపల్లి దశరథరామయ్య, ఆయన ధర్మపత్ని కౌసల్య బహూకరించిన బలిపీఠంను వేదపండితులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. హోమాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉప సర్పంచి పులి ప్రసాద్‌రెడ్డి, గ్రామ పెద్దలు యోగిరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.